# 10

## సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి




రాత్రి ఏడుగంటలైంది.

పలుగు రాళ్ల మిట్టన చేరిన జీవాలమందలోని గొఱ్ఱెలు సన్నగా రాలే పుల్లచినుకులకు వొళ్లంతా విదిల్చుకొంటున్నాయి పాలుతాపి గూళ్లకిందేసిన గొఱ్ఱెపిల్లలు తల్లులకోసం ఇంకా అరకొరగ గోలజేస్తున్నాయి.

గొఱ్ఱెపెంట ఉచ్చతో కలిసిన బురదమట్టి వాసన వెగటు దనపు మత్తును కలిగిస్తూ వుంది.

బొట్టెకట్టెపైన పిడికిలి బిగించి, పిడికిలిపైన గడ్డమాన్చి గొర్లమందకు పడమటి భాగాన నిల్చునివున్నాడు బొల్లేవుల గంగయ్య

మందకు తూర్పు దిశనుంచి నల్లబోతుల గురప్ప గొంత చినుకుల్లో తడుస్తూ కీలగా విన్పిస్తూ వుంది. కులుకుడు భజన పాటల్లోని పల్లవినొకదాన్ని పట్టుకుని అదేపనిగా సాగదీసి మెలికలు తిప్పుతున్నాడు అతను.

గంగయ్యకు అవేమీ పట్టలేదు.

ఏవేవో ఆలోచనలు మెదడును కందిరీగల్లా చుట్టుముట్టి జుమ్మురుమని రొదజేస్తున్నాయి.

నిల్చుని నిల్చుని కాళ్లు పీకుతున్నాయి.

కింద కూచుందామంటే బురద కసాపిసామంటోంది.

ఇళ్లవద్దనించి మనుషులొచ్చే దాకా యీ నిలువుకాళ్ల జీతం తప్పేట్టు లేదు. మేక అరుపు విన్పించినట్టయి అటుకేసి చెవులు రిక్కించాడు గంగయ్య. పాటలమీదున్న గురప్ప దిశనుంచే ఆ అరుపు.



# బురద

"ఓయ్ గురప్పా! పోతాంది సూడూ... పత్తి సేను గెట్టు తొక్కినట్టుంది సూడూ మేకపోతు... దాని సరుకుదగిలీ..." అరచి చెప్పాడు.

గురప్ప నోటినుంచి పాట ఆగింది. గట్టిగా అరచి రాళ్లు విసిరిన శబ్దం. మేకపోతును దారి మళ్లించి మందజేర్చిన సడి.

మందలో మేకపోతులు వుంటే ఇదే గొడవ. ఒకచోట కుదురుగా వుండవు. ఎంత కనిపెట్టుకొని వున్నా మనిషిని ఏమార్చి పక్కచేలల్లోకి పోదామనే వాటి బుద్ధి. అక్కడికీ ముందుకాళ్లు కొంకుల్లోకి మడిచి కట్టినా మోకాళ్లతో దోగాడుతూ గెట్లమీది కంపచెట్లకేసి వెళ్తాయి. వాటివెంట బుద్ధిమంతురాళ్లా సాగే గొర్రెలు నేరుగా పైరుమీదనే దాడిజేస్తాయి.

మందకు ఒకటి రెండున్న మేకపోతులతోనే యీ చిక్కంతా. మంద నడక సూటిగా, వేగవంతంగా ఉంటుందని వాటిని పెంచుకోక తప్పటం లేదు. రైతుల చేత తిట్లదినక తప్పటం లేదు.

ఎప్పుడో ఎర్రటి ఎండల రోహిణి కార్తెలో బోరుబావుల కింద పత్తినాటారు. కరువుగాలంలో వాటి వేర్లను నీటితో తడపటమంటే ఆ కష్టం రైతుకే తెలుసు. తొలకరింపులొచ్చేసరికి జానెడు మూరెడు పైరైంది.

ఇప్పుడు జీవాలు కొరికితే ఆ మొక్కల బతుకంతా కునిస్టే. తాము రవ్వంత అజాగ్రత్తగా వున్నా ఏడాది పైరు నాశనం. రైతు 'గూ...బే...' అని ఏడవటం... మొత్తుకోవటం.... తమను తిట్టటం... ఖాయం.

ఊరివైపు నుంచి టార్చిలైట్ల వెలుతురు.

పఱ్రుపఱ్రుమంటూ బురద దారిలో అడుగుల సడి.

వెదురు జిట్టెల మచాలమీద జిడ్డు కాగితపు గూడలు వేసికొచ్చి, మందకు తలొకవైపు దించారు గొల్లలు.

అడుగెత్తున్న మంచాల్ని నేలమీదేసి గూడకప్పుకొని పడుకొంటే - ఎన్ని పుట్ల వానొచ్చినా లెక్కలేదు.

"వాన జస్సయేట్టుంది. మీరింగ ఇండ్లకు పొండి నాయనా!" చెప్పాడు గంగయ్య కొడుకు చంద్రన్న.

"నువ్వొచ్చినావేమెరే? వాన్ని... రవనాగాన్ని పంపీగూడదూ!" గంగయ్య అన్నాడు కొడుకుకేసి చూస్తూ.

"యాడుండాడు? రాఘవన్నను యిడిసొచ్చే గాదూ..."

ఓసారి నిట్టూర్చి ఇంటిదారిబట్టాడు గంగయ్య

"పంచాయితీ కాడ యాలబడిపొయ్యేవు మామో! గట్టిగుండు..." వెనకనించి ఓ యువకుడి స్వరం.

"నువ్వు మెత్తబడితే మనం గొర్లగాయడం మానుకోవాల..." మరో యువకుడి గొంతు.

గంగయ్య గుండెల్ని సూటిగా తాకాయి ఆ హెచ్చరికలు.

వింటూనే బురదలో అడుగులేసికొంటూ వూరికేసి సాగాడు.

మూడు రోజుల్నించి దయ్యంలా పట్టుకొంది పంచాయితీ సమస్య. దాన్ని తల్చుకుంటే చాలు గుండెలు లబలబలాడుతున్నాయి. ఒళ్లంతా తత్తరబుడుతూ వుంది.

వీధులన్నీ సిమెంటు రోడ్లుగా మారటం వల్ల వూర్లోకి అడుగుపెట్టగానే బురద పీకడ తగ్గింది. మలుపు తిరిగి తమ వీధిలో ప్రవేశించి ఇంటిముందు ఆగాడు. ఇంట్లోకి వాకిలిగుండా జారే కరెంటు బల్బు వెలుతురులో జాగ్రత్తగా కఱ్ర పూదుకొని రోడ్డుమీంచి దిగాడు. గిరిగల్లోతు బురదలో యీదుతూ పందిరికిందకు చేరాడు.

ఇంట్లోకెళ్ళి ఆదరాబాదరా నాలుగు కబళాలు మింగేసరికి మోపూరి రాఘవనించి పిలుపు- 'తను దేవాలయం దగ్గరకు పోతున్నాననీ, తొందరగా రమ్మనీ.

చినుకులు ఎండుటాకుల పందిళ్లపైనా, రేకుల కప్పుమీదా సన్నగా చిటుకులేస్తున్నాయి.

అరచేతుల్ని తుండుగుడ్డకు తుడుచుకొంటూ వచ్చి పందిరికింది నులక మంచమ్మీద కూచుని బీడి ముట్టించాడు గంగయ్య. దమ్ములాగి వదల్తూ ఆలోచిస్తోంటే వాకిట్లోంచి గురమ్మ అంది' యింగా యీన్నే వుండావే! ఆ యబ్బి రమ్మని సెప్పంపె మరి..." అని

సమాధానమివ్వకుండా మరోదమ్ము లాగాడు.

ఆమె వాకిట్లోంచి కదల్లేదు.

మంచం కోడుకు కట్టేసివున్న బఱ్రెదూడ గోముగా అతని కాళ్లను నాకజొచ్చింది.

ఓచేత్తో దాని మోరను పక్కకు నెడుతూ కఱ్ర పూదుకొని లేచాడు.

తలమీద గుడ్డేసుకొని జాగ్రత్తగా రోడ్డెక్కాడు.

రెండు అడ్డవీధులు దాటిన తర్వాత కఱ్ర నేలమీదాన్ని తలెత్తి చూశాడు.

ఎదురుగా వీధి మలుపులో పెద్ద అరుగుమీది వేపచెట్టు నల్లగా చీకటి ముద్దలా కన్పిస్తోంది. అక్కడికి వెళ్లి ఉత్తరం దిక్కు చూస్తే దేవాలయం... గుడి ముందు తనకోసం నిరీక్షిస్తూ కాపులూ, గొల్లలూ... రెండు రోజులుగా తెగని పంచాయితీని యీరోజు అటో ఇటో తేల్చుకోడానికి మోహరించిన ఇరువర్గాలు...

గంగయ్య కాళ్లు ససేమిరా ముందుకు సాగలేదు.

గుండెల్లో ఏదో అలజడి. మనస్సులో మరేదో అస్తిమితం.

అరుగు వద్దకు వెళ్లేందుకు ధైర్యం చాల్లేదు.

వెనక్కు మళ్లితే తనకోసం మనిషి వస్తాడేమో! ఇప్పటికే బయలుదేరి వుంటాడేమో!

వీధి పక్కగా సందుకేసి చూశాడు.

పాములేటి మామ గుర్తొచ్చాడు.

ప్రస్తుతం అటుకేసి తప్పించుకోవటమే ఉత్తమంగా తోచింది.

సిమెంటు రోడ్డు అంచులమీంచి సందులోకి దిగటంలో కాలుజారి నేలకు వొరగబోతూ చివరి

# దారి...!

**చిత్తలూరి సత్యనారాయణ**

అతనూ అదే దారిన వెళ్లాడు
ఆమెదీ అదే దారి....
ఇతనూ అదే దారిన వెళ్లాడు
బతుకు రాదారయినా
గోదారయినా
ఏదో ఒక రోజు అందరూ....
ఆదారిన కలవాల్సిందే...
దారికిరువైపులా - పచ్చని
చెట్లుంటాయి
చెట్లకింద నీడలుంటాయి
నీడల్లో సేదదీరే
బతుకులుంటాయి.
బతుకుదెరువు లేని
దారులూ వుంటాయి.
అతను వెళుతూ వెళుతూ...
కొన్ని చెమట చుక్కలు చల్లాడు.
దేశం సస్యశ్యామలమయింది
ఇతను పోతూ, పోతూ
కొన్ని అక్షరాలను చల్లాడు
దేశం నిండా చైతన్యం మొలకెత్తింది.
ఆమె వెళుతూ వెళుతూ
ఇంత ప్రేమను వదిలేసి వెళ్లింది
సమాజం నిండా అనుబంధాలు పూశాయి.
దారిని మోస్తూ వెళ్ళిన వాళ్లు
నలుగురికి దారి చూపించిన వాళ్లు
నలుగురు మోస్తూ...
అదే దారిన వెళుతున్నారు.
దారంతా దుఃఖంతో తడిసిపోయింది.
ఇప్పుడు దారికిరువైపులా జ్ఞాపకాలు నాటుకుంటున్నాం.
జ్ఞాపకాల్లోంచే మరణించిన వాళ్లు
మనల్ని బతికిస్తూ వుంటారు.
దారి దారిని చేసుకుంటూ
ముందుకు వెళుతూనే వుంది.
ఇప్పుడు దారికివువైపుల
సీతాకోక చిలుకలెగురుతున్నాయి.
దారి దారంతా పూల వాన...
దారి పొడవునా జ్ఞాపకాల పరిమళం.
ఇతనూ అదే దారిన వెళ్లాడు
వెళుతూ..... వెళుతూ...
కొన్ని అక్షరాలను చల్లాడు.

క్షణంలో కర్ర ఆసరాతో నిలదొక్కుకున్నాడు.

వీధులన్నీ సిమెంటు రోడ్లయితే కాలికి బురద అంటకుండా తిరగొచ్చుననుకొన్నారు గాని - వీధి మిర్రయి, ఇళ్లు తగ్గాయి, నట్టిల్లు కూడా బురదగా మారుతుందని వూహించలేదు. వీధులకు సరిపడేంత ఎత్తుకు తమ బతుకులు ఎదిగితే గదా బురద మాయమయ్యేది!

సందులోని రొంపిని యీదుతూ మెల్లిగా గొడ్లకొట్టాన్ని సమీపించాడు.

"మామా! ఓ మామా!" పిల్చాడు

కొట్టంలోంచి మనిషి కదలికల మంచం చిటపటలు.

"ఎవరూ?... ఎవురొరే నాయినా... ఒరే గంగడూ.. "గొంతును గుర్తుబట్టినట్లుంది.

"ఆ... నేనేలే..." వెళ్లి మంచంమీద కూచున్నాడు.

"ఏందొరే యింగా యీడుండావు? పంచాయితీకాడికి పోలే...?

"పోలే... పోవాల..."

"పోయిరాపోరా మరి..."

గంగయ్య మాట్లాడలేదు

జేబు తడివి బీడి తీసి ముట్టించుకొంటూ ముసలాయనకు ఒకటి అందించాడు. అగ్గిపుల్ల గీచి రెండు అరచేతుల్ని గూడుగా చేసి ఆరిపోకుండా బీడీ వెలిగించుకున్నాడు. ఆ గూడును అలాగే తీసుకెళ్ళి ముసలాయన నోట్లో బీడి కూడా ముట్టించాడు.

దమ్ము లాగింతర్వాత ముసలాయన మరోసారి ప్రశ్నను పొడిచాడు.

"పోబుద్ధిగాలే మామా! బయమేస్తోంది..." తలొంచుకొని చెప్పాడు.

"ఏందిరా నువ్వనేది!"

"అవ్ మామా! నిన్న రేత్రి గూడా తప్పించుకునే తిరిగినా..." అంటూ గతరాత్రి జరిగిన పంచాయితీ గురించి పొడిపొడిగా వివరించాడు.

"అదిసరే గంగడూ! పంచాయితీ అన్నేంక పోయి కూకోవాలగదా! బయపడి దూరంగా వుంటే ఎట్టా?"

అసహనం తన్నుకొచ్చింది గంగయ్యకు.

"పంచాతీ పంచాతీ అంటాండవు. నీకివ్వుడు ఎనభై ఏండ్లొచ్చింటాయి. పదేండ్ల పిల్లోనెప్పట్నించీ గొర్లగాసింటావు. నువ్వెప్పుడన్నా యిట్టాంటి పంచాతీలో కూకోనుంటావా? పొరబాటున్నో యేమారో రైతుల సేలాల్లో పైరు మేపకుండానే గొర్లాలు సాకినవా? నిన్నెవురన్నా దేవలం కాడికి పంచాతీకి పిల్చింటారా?" అన్నాడు కోపంగా.

"ఓరి నీ ఎర్రి దొంగల్దోలా! మా కాలాలు వేరులే నాయినా! ఎర్రి కాలాలు.. గొర్రె పైరు మేస్చుయి. రైతులొచ్చి నోటజెప్పరాని తిట్లు దిద్దారు. పైనబడి కొద్దారు గూడా... మేసింది గొర్లయినా గొల్లోడు వీపిచ్చి తలంచుకోవాలి. ఇప్పుడా ఓపికలేదుండాయి. అందుకే చానామంది గొల్లోలు రైతులయ్యిను..."

తర్వాత ఏమీ మాట్లాడలేదు గంగయ్య.

రోడ్డుమీద సరాపరామంటూ ఎవరో తమవీధికేసి వెళుతోన్న సవ్వడి... బహుశా తనకోసమే కాబోలు.

కొంతసేపయిం తర్వాత వెనుదిరిగి పోతోన్న అడుగుల సడి.

"పో నాయినా! పోరా!... ఎట్టయితే అట్ట జరగనీ పో..." పాములేటి చెప్పాడు. గుడికేసి వెళ్లేందుకు గంగయ్య కాళ్లు ససేమిరా కదలమంటున్నాయి. తను పోతే గొడవయ్యేట్టుంది.

తనకూ సుబ్బారెడ్డికి మాత్రమే తకరారయితే ఇబ్బంది లేదు. గొల్లలకూ కాపులకూ మధ్య కొట్లాటగా మారిపోయి వుంది అది.

తను కేవలం నిమిత్తమాత్రుడయి వున్నాడు.

మంచం మీంచి లేచి మెల్లిగా రోడ్డెక్కాడు.

బురదనీళ్లలో తడిసిన పంచె చివర్లను ఎగబెట్టుకొంటూ పెద్ద అరుగు వద్దకు చేరుకొని దేవాలయం కేసి చూశాడు.

గుడి పంచలోని బల్బు వెలుతుర్లో అక్కడి జనం కన్పిస్తున్నారు. గొల్లలూ కాపులు దండిగానే మోహరించి వున్నారు.

టార్చిలైటు వెలుతురు ఒకటి తనకేసే వస్తున్నట్లుగా అన్పించి ఆదరాబాదరా రోడ్డుదిగి పక్కనే వున్న గొడ్ల కొట్టంలోకి దూరాడు. కిందకు దిగజారివున్న చూరువాసం ఒకటి తలకు పొడుచుకొని కళ్లు గిర్రున తిరిగాయి. చేత్తో రుద్దుకుంటూ కొంతసేపటికి బాధను అణచుకున్నాడు.

తన అవస్థ తనకే సిగ్గుగా అన్పించింది గంగయ్యకు.

దీనికంతటికీ కారణం... సమస్యపట్ల తన ఉదాసీనత కూడా

తమ అరచేతుల్లోనే సులభంగా విడివడాల్సిన సమస్య, ఎంత సులభంగా జారిపోయి కులపెద్దల చేతుల్లో పడి ముడివడిందనీ!

కులపెద్దలంటే... వయసులో పెద్దవారయివుండీ, జీవితానుభవం దండిగా ఉన్నవారయితే ఇబ్బంది లేకుండు. రాజకీయాలు తలకెత్తుకొని ఓట్లకోసం దబ్బు, మందు మత్తుల్లో జనాల్ని ముంచేవాళ్లు... వాళ్లు కులపెద్దలు కావటం వల్లనే ఇలాంటి ఇబ్బందులు వచ్చిపడుతున్నాయి.

అట్లా తయారైన వాళ్లే కాపుల కులపెద్ద

ప్రతాపరెడ్డి. గొల్లల దండుదొర రాఘవ. ఇద్దరూ చెరొక రాజకీయపార్టీకి కొమ్ముకాస్తున్నారు.

ప్రతాపరెడ్డిని ఎదిరించే శక్తి రాఘవకు ఇబ్బంది పక్కూరి మండల కేంద్రం నాయకుడు వీరారెడ్డి. ఇక్కడ తన ప్రత్యర్థి అయిన ప్రతాపరెడ్డికి పోటీగా సంఖ్యాబలం దండిగా వున్న యాదవకులాన్ని చేరదీశాడు. రాఘవను నాయకుణ్ణి చేశాడు.

వాళ్లేమో కాంట్రాక్టు పనులు చేసుకొంటూ సారా వ్యాపారాలు నిర్వహించుకొంటూ సిమెంటు రోడ్లలా బలిసిపోయారు. ఖద్దరు చొక్కాల మడతలు నలగకుండా తిరుగుతున్నారు

తామే... యీ మోకాటిలోతు బురదలో...

గుడివద్దనుంచి సన్నగా అరుపులు.

నలుగురు మనుషులు అరుగుదాకా వచ్చి వేపచెట్టుకింద నిల్చున్నారు.

"గంగయ్య లేకుండా ఏం పంచాయితీ జెయ్యాల?"

"ఎన్నోజులని తప్పించుకొంటాడు... యీ రేత్రి అటో ఇటో తేలిపోవాల. పంచాతీ తెగకుంటే రేప్పొద్దున దొడ్డిని చుట్టుకోవాల్సిందే... గొర్లను నిలేయాల్సిందే... గొల్లనాయాన్లకు కాపోల్లంటే యేందో చూపించాలి...88

రెండు దమ్ముల్లో బీడిల్ని చివరికంటా లాగి నేలకు విసిరి గుడికేసి వెళ్లారు వాళ్లు.

కొంతసేపటికి మరో ఇద్దరు వచ్చి అక్కడ నిల్చున్నారు.

"ఎర్రి గొల్లోల్ల కాలమనుకొన్నారేమో! దొడ్డికాడికి రానీ నాయాన్లను... పచ్చి పాల్దాగినోల్లం... మన సంగతెన్నా తెల్లే..."

గంగయ్య గుండెలు దడదడలాడాయి.

ఇప్పుడొచ్చిన వాళ్లెవరూ పైరు నష్టపోయినోళ్లు కాదు. నష్టపరచిన వాళ్లు కాదు. అయినా కొట్లాటకు 'సై' అంటున్నారు.

దేవాలయం వద్ద అరుపులు మరింత పెరగటంతో వేపచెట్టుకింది మనుషులు అటుకేసి కదిలారు.

రాఘవ గొంతు స్పష్టంగా విన్పిస్తోంది గంగయ్యకు.

తను పంచాయితీకి రానందుకు కేకలేస్తున్నాడు. తన బదులు అతనే పంచాయితీ జరుపుతానంటున్నాడు.

ఏం పంచాయితీ చేయగలడు! నష్టపరిహారం ఇచ్చేది లేదంటాడు. గొర్రెల్ని ఎట్లా నిలేస్తారో చూద్దాం రమ్మంటాడు. గొల్లలందరికీ ఆవేశం నూరిపోస్తాడు. అవతల ప్రతాపరెడ్డి కూడా అదే పనిమీద వుంటాడు.

ఆలోచనల్లో పడ్డాడు గంగయ్య.

పొరబాటు జరిగింది. కొండపాలెం వెళ్లి, నెలరోజులుకు పైగా నల్లమలలన్నీ తిరిగి మేసి, ఇప్పుడు ఇక్కడ వానలుపడి గడ్డి పచ్చబడటంతో పూర్లకు దిగివస్తూ వున్న తమ గొర్రెల మంద పొరబాటున సుబ్బారెడ్డి పత్తిచేలో జొరబడ్డాయి. కనుక్కొనేలోపే అర్దెకరా పత్తి మొలకల్ని కొరికాయి. బైటకు మల్లెయబోతే చేనికి అడ్డంగా పరుగెడుతూ మిగతా అర్దెకరా కూడా అక్కడక్కడా కొరుకుతూ వెళ్లాయి.

సమయానికి సుబ్బారెడ్డి లేడు.

కొడుకులున్నారు ఆవేశపడ్డారు.


తమవాళ్లు ఓర్చుకుని వుంటే బావుండు. రమణ తిరగబడ్డాడు. నష్టపరిహారం కట్టిస్తాముగాని తిట్లు పడేది లేదంటూ ఎదురుమల్లాడు.

అదిగో... అప్పుడొచ్చింది అసలు సమస్య.

పైరు వేసిన గొల్లోడు గొర్రెలాగా తలొంచుకు పోవాలిగాని తల నిక్కబెట్టి కూడదనేది రెడ్డిగారి సిద్దాంతం. నిక్కబెట్టారు కాబట్టి పైరునష్టం కాస్తా పంటనష్టంగా లెక్కించి ఇరవైవేల రూపాయల పరిహారంగా ఇవ్వాలంటూ పట్టుబట్టారు. అని అసమంజసమైన కోరికగా తమవాళ్లు వ్యతిరేకిస్తున్నారు.

పరిహారం చెల్లించకుంటే దొడ్లల్లోంచి గొర్లను లేపదోలనివ్వమనీ, మేయను పోనివ్వకుండా నిలేస్తామనీ రైతులు బెదిరించటంతో - ఎట్లా నిలేస్తారో చూద్దామని మండల నాయకుని వత్తాసుతో గొల్లలు గాండీవం బోతారు.

తన హయంలో ఎప్పుడూ యీ రాజకీయాల్ని మూచూసినోడుగాడు, పూసుకున్నాడు




కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

- బి. ధనుష్, విజయవాడ.

కాదు గంగయ్య. గొర్రెలు, ఇల్లు తప్ప మరో లోకం ఎరుగనివాడు. తన యింట్లో పుట్టాడొకడు తోకచుక్క. ఈకలు తోకలు రాకముందే వీధుల్లోకి పోవటం నేర్చుకున్నాడు. అడ్డపాలు తాగే గొర్రెపిల్లను కనుక్కోలేడుగాని అడ్డదావల రాజకీయం గురించి బాగా తెలుసు. ఇంటికంతటికీ హుషారైనవాడే. కానీ ఏం లాభం? మందలో మేకపోతులాంటోడు. మందకు దారి చూపిస్తాడు. నడక నేర్పుతాడు. దొడ్లో మాత్రం కుదురుగా వుండనే వుండడు. మేకల్లకాడికి మడిచి కట్టినా దోగాడుతూ అయినా పక్కచేలల్లోకి పోతాడు. తకరార్లు మోసుకొస్తాడు.

తనిప్పుడు ఏం చేయాలో అర్థం కాలేదు.

పంచాయితీ దగ్గరకు పోతే ఇరవై వేలు కాకున్నా పదివేలకయినా ఒప్పుకోవాలి. లేదా ఘర్షణ ప్రకటించి రావాలి.

గుండెల్లో పదరు మొదలై మరోసారి బీడి ముట్టించుకొన్నారు గంగయ్య. సుబ్బారావుది కూడా తమలాంటి కుటుంబమే. పొలమూ ఇల్లు తప్ప ఇంకో ప్రపంచం తెలీనోడు. అతనిప్పుడు దేవాలయం వద్ద ప్రత్యార్థులతో కలసి గొడవకే సిద్ధమైనాడంటే వింతగా వుంది. తన పిల్లలూ, అతని కొడుకులూ గొడవ పడినరోజే తనతన్ని కలుద్దామనుకొన్నాడు. ఎప్పటిలాగే మామూలు పద్దతిలోనే సమస్య వాగదెగుతుందనుకొన్నాడు. రెండో రోజుకంతా రాజకీయం జొరబడింది. తనెంత ప్రయత్నించినా అతనితో మాట్లాడెందుకు వసతి కుదరలేదు. ఒంటిరిగా దొరకలేదు. కొడుకులో, బంధువులో, కులస్థులో తోడు కన్పిస్తున్నారు.

దేవాలయం వద్ద కొంత రభస జరుగుతూ వుంది.

తనను దాచిపెట్టి నాటకాలు ఆడుతున్నారంటూ గొల్లలమీద అభాండాలు వేస్తున్నారు కాపులు.

సాటి కులస్థులు తన్ను తిడుతున్నారు.

తన కొడుకు రమణను ముందుకు తోసి 'పంచాయితీకి సిద్ధ'మంటూ ప్రకటించాడు రాఘవ.

చాలాసేపు ఏదేదో గొడవ. మాటలు సరిగ్గా విన్పించటం లేదు. కొంత సేపు గట్టిగా కేకలేసికోవటాలూ, మరికొంతసేపు మంద్రంగా మాట్లాడుకోవటాలూ... బొమ్మలాట వేసే స్టేజి గుడారంలా వుంది దేవాలయమంతా. యుద్ధసీనులో హోరెత్తే గడబిడ శబ్దాలు, మామూలు సమయంలో

కీలగా విన్పించే ఒంటరిగొంతుల సవ్వళ్లు, రకరకాల చప్పుళ్లతో కూడిన వెలుతురు దేరాలా వుంది దూరాన్నించి చూస్తోంటే

కొందరు దేవాలయం బైటకొచ్చారు. రోడ్డుమీద నిలబడి కేకలేస్తున్నారు.

"తరతరాల్నుంచీ మీమాటే యింటాన్నాం రెడ్డోల్లజెపుతే అదే ఖాయమనుకుంటున్నాం. మా ఓట్లన్నీ మీకే బేసి మిమ్మల్ని పెసిడెంట్లన్జేసినం. మండలాలకు పంపిచ్చినం. మీరు జెప్పినోల్లనే ఎమ్మెల్లేలన్జేసినం.. ఎంపీలన్జేసినం.. బతికినన్నాల్లూ మీ కాల్లకాన్నే పడున్నెందుకు మాకు బాగా బుద్ధిజెపుతుండారు... రెడ్డిగారనిపించుకొనైరు..." మునెయ్య గొంతు గట్టిగా విన్పిస్తోంది. "రవ్వంత సేను మేసినందుకే యింతలావు పన్జేస్సారా?"

"మీరు సేలు మేపంది ఎప్పుడోయ్? ఏకారు వొదిలిపెట్టిన్రూ? మీ అబ్బబ్బ హయాల్నుంచీ మేపుతుండారు గదా! ఎప్పుడైనా యిట్లా పంచాయితీలైనాయా? మీగ్గూడా రాజకీయాలు కావాల్సొచ్చె... నాయకత్వం కావాల్సొచ్చే... యీ వూరి రెడ్డిగారు చులకనైరి. పక్కూరి రెడ్డిగారు మారాజులైరి... మీరూ రాజ్యమేలాలనే గాదూ ఈ కొట్లాట,, యీ పంచాయితీలోనూ..." రామిరెడ్డి కేకలేశాడు. "మీరు మామాట వింటాన్నెపుడు చేలు మేపినా వూరుకునేవాల్లం. ఇప్పుడు మా మాటను లెక్కజెయ్యడం లేదుగదా! నష్టపరచి కూడా తిట్లు ఒర్చుకోడం లేదుగదా! కాబట్టి లోగడట్లా మేమెందుకు వూరకుంటాం! మీరు యాదవులయిన్రు గదా! యాదవులకు తగినట్లే వుంటది. ఇది గొల్లోల్ల పంచాయితీ కాదు.. యాదవుల పంచాయితీ..."

పంచాయితీ చెడిపోయినట్లుంది

జనం ఇళ్లకు మల్లుతున్నారు.

నష్టపరిహారం చెల్లించకుండే నిలేస్తామంటున్నారు కాపులు.

నిలేసి చూడమంటున్నారు గొల్లలు.

"పొద్దున్నే దొడ్లకాడ చూసుకుందాం లె"మ్మంటూ బీరసాలు తీస్తూ వీధులెంట వెళుతున్నారు ఇరువర్గాలూ.

తలంతా దిమ్ముగా వుంది గంగయ్యకు.

వానం దెబ్బకంటే పంచాయితీ పోటు బలంగా తగిలింది.

మెల్లిగా బురదలో కాళ్లీడ్చుకొంటూ సందు తిరిగి పాములేటి మంచం వద్దకెళ్ళాడు.

"ఎవరోల్లు?"

"నేనేలే..."

"ఏమయిందోరే పంచాతీ."

"ఏమయితది? పొద్దున్నే గొర్లదొడ్డకాడ గోసులెగజెక్కాల..." జరిగిన విషయం చెప్పాడు.

"సేటుకాలమొచ్చింది గదొరే! పెడిపోతరు నాయినా! వూరు నాశినమయిద్దిరా గంగడూ!" "ముసలాయన గొంతులో ఆవేదన సుడులు తిరిగింది.

"అయితే నన్నేంజెయ్యమంటవే.." గట్టిగా అరిచాడు అశక్తత నిండిన గొంతుకతో. "పెద్దరికం కోసం, వూరిపెత్తనం కోసం.. రాజకీయం కోసం నేనీ గొడవ పెట్టుకొన్నేనంట..." "గొంతు బొంగురుపోయింది గంగయ్యకు. ఇంకా ఏదేదో మాట్లాడుతోన్న అతని గొంతులో ఏడుపు జీరకూడా విన్పించినట్లుగా తోచింది పాములేటికి.

"అట్టొకడు యిట్టొకడు సిమెంటు రోడ్లాల బలిసి ఇండ్లన్నీ బురద జేస్తాండరు నాకొడుకులు... కాపునాకొడుకొకడు... గొల్లనా కొడుకొకడూ.. నట్టింట్లోకి నీల్లు పోయి అయ్యన్నీ ఎత్తి పోసుకోలేక ఆడోల్లు తిట్టే తిట్లతోన్నా యీల్ల పొట్టలు పగిలి సావలే.. యీల్ల సరుకు దగల!... యీ నాయాండ్లకు ముక్కుపుండ్లు పగల..."

"వొరే గంగడూ! పిల్లి శాపెన్లకు ఉట్లు తెగవులేరా! ఎట్టయితే అట్టయితది... పండుకో నాయినా!" ముసలాయన చెప్పాడు.

మరికొంతసేపు గ్రామపెద్దల్నీ, తన కొడుకునీ తిట్టుకుంటూ మెల్లిగా గొంతు మూసికొన్నాడు గంగయ్య. కుక్కిమంచంలో వాలి రెప్పలు అంటించాడు గాని కనుపాపల పైకి నిద్రవచ్చి వాలులేదు. ఆవేశాలన్నీ చల్లార్చుకొనేసరికి మూడు జాములు గడిచిపోయాయి. ఆ చల్లపొద్దున ఆలోచించటం మొదలుపెట్టాడు.

తనకు తెలిసి సుబ్బారెడ్డి కూడా తనలాంటివాడే. గొడవలంటే భయపడే వాడే... ఖచ్చితంగా అతనూ తనలాగే బాధపడుతూ వుండొచ్చు.

ఆ ఆలోచన వచ్చిందే తడవు లేచి కూచున్నాడు.

బీడి ముట్టించుకొంటూ దృఢంగా నిర్ణయించుకొన్నాడు – అతన్ని కలవాలని తనకెందుకో ఆశగా వుంది.

తొలికోడి కూసిందే తడవు చెంబుపట్టుకొని డొంకదారి బట్టాడు. ఊరుదాటి ఓ కలవె చెట్టు చాటున గొంతుక్కూచుని నిరీక్షిస్తూ వుండిపోయాడు. జనం అప్పుడొకరు ఇప్పుడొకరుగా చెంబుపట్టుకొచ్చి, తిరిగి వెళుతున్నారు అక్కడొకటి ఇక్కడొకటిగా బీడీ ముక్కలు మినుకు మినుకుమంటున్నాయి.

అప్పటికే రెండు బీడీలు కాల్చివున్నాడు గంగయ్య.

మూడో బీడీ ముట్టించుకొందామనుకొన్నంతలో ఆయన కళ్లు మెరిగాయి. డొంకదారిన వచ్చే మనిషిని స్పష్టంగా పోల్చుకున్న తర్వాత మెల్లిగా లేచి నిల్చున్నాడు చెంబు చేతబట్టుకుని అతని వెనుక నడవసాగాడు.

గంగయ్య వూహించినట్లుగానే సుబ్బారెడ్డి నేరుగా తన చేనికి దక్షిణం వైపున్న వంకగట్టుకు చేరుకొని గాని ఆగలేదు. గులకమొరపు వంకజేడెల్లో కూచుని బీడి ముట్టించుకోబోతూ తను కన్పించేసరికి నొసలు ముడేశాడు.

తనూ ఓ చిన్న గారకంప పొదచాటున కూచుంటూ "ఏం సుబ్బారెడ్డే ఇంట్లాయంనే యవ్వారమంతా రోతబట్టిందిగదబ్బీ!" అంటూ నిట్టూర్చాడు గంగయ్య.

సుబ్బారెడ్డి సమాధానం ఇవ్వలేదు.

"నువ్వూ నేను ఎప్పుడన్నా ఒకమాటనుకుంటిమా – ఒకర్నొకరం పొరచూపులు చూసుకుంటిమా? మద్దెనాకొడుకులొచ్చి నీ కొంపకు నా కొంపకూ సేటుదెచ్చిపెట్టిరిగదబ్బీ!" తనూ బీడి ముట్టించుకొంటూ అన్నాడు. "నువ్వు ఎద్దుముద్ది పొద్దుకుంటా బరక సేలల్లో, నేను గొర్రెతోకలెనక దిరుగుతా బీళ్లు బోళ్లల్లో బతుకుతాంటిమి. ఇద్దరమూ లోకం దిక్కు సూసినోల్లమే గాదు. ఎవని కండ్లు మండినాయోగాని కడకు మనకే ముట్టించిరే.. మన కొంపలు యీడుబోయేకాడికి వొచ్చేనే..."

తలెత్తి అతనికేసి చూశాడు సుబ్బారెడ్డి

"నాకొక పోరంబోకు నాకొడుకుండాడు. నీకు వొకడుండాడులే తలమునిరినోడు. యిల్లిద్దరూ మన అంకెకు వచ్చేట్టులేరు. సెప్పుడు మాటలిని మనకండ్ల ముందే అగ్గి తగిలిచ్చేట్టుండారు. నీ కంటే పెద్దోన్నయినా నీకు దండం పెట్టాండబ్బీ! రవ్వొంత పెద్ద మనసు సేసుకో నాయినా!" ప్రాధేయపడ్డాడు గంగయ్య.

అప్పటికీ సుబ్బారెడ్డి నోరు విప్పలేదు.

"అదిగాదబ్బీ! లేతపైరు కొరికనయి... నష్టమే జేసినయి... కావాలంటే ఒక పొట్టేల్ని పట్టిమని అడుగు.. లెక్కేందిబ్బే! ఇరైయేలు లెక్క... సేనంతా పైరయి తెగుల్లేకుండా పెరిగి, పత్తి బాగా యిరిగినా అంత లెక్క రాదుగదబ్బీ! దానిగ్గూడా ఎంత కట్టపడాలి! ఎంత పెట్టుబడి పెట్టాలి!.... నోరెట్టా ఆడిందబ్బీ ఇరైయేలడగడానికి?" గంగయ్య అన్నాడు.

బీడీముక్క విసరేస్తూ సుబ్బారెడ్డి చెప్పాడు "నేనేమి అడగలే..." అని. లేచి వంకలోకి దిగుతూ

అన్నాడు "అస్సలు నువ్వు పంచాయితీకాడికి వచ్చే గాదూ!" గంగయ్య కూడా లేచి వంకలోకి దిగాడు.

"ఎందుకు.... ఎందుకబ్బే పంచాతీ! మనిద్దరి మద్దెన పంచాతీ యేల. మేసింది నా గొర్రెలు... నట్టపోయింది నువ్వు. నేనేం కాదంటన్నా?... గొర్లు కొరికిందానికి లెక్కగట్టమంటే గొల్లోన్ని నేనేడ తేవాల?.... నువ్వొప్పుకుంటే మేసిన గొర్రెలే నీకు నట్టం కట్టిస్చాయబ్బీ! మా దొడ్డి గొర్లంటెనూ నాల్రోజులు నీ చేలో తోలుకోపో... వాటి ఉచ్చ పెంట సత్తవతో పైరు పూగులాడిపోద్ది. మల్లా కారుకు అడిగినన్ని పండుద్ది..." చెప్పాడు.

తరతరాలుగా వస్తోన్న రైతు గొల్లల మధ్య తగవు తీర్పులకు సంబంధించిన న్యాయం అది. సాంప్రదాయిక న్యాయం. ఆరోగ్యకరమైన న్యాయం.

ఈ మూడురోజుల పర్యంతం అపోహలకు తావిచ్చిన సంఘటనల్ని గురించి ఒకరిమీద మరొకరు ఎక్కస వెళ్లబోసుకొని శాంతించిన తదుపరి సుబ్బారెడ్డి అన్నాడు "నీకు తెల్దా- అది రెండెకరాల సేనని... నాల్రోజులకు కలుస్చాదా." అని

"నాలుగ్గాకుంటే.. వారంరోజులు తోలుకోపోబ్బీ!"

"నీ పీనాసిబుద్ది పోనిచ్చుకొన్నెవు కాదు. పదైదు రోజులకు తక్కువైతే కుదరదు" ఖచ్చితంగా చెప్పాడు సుబ్బారెడ్డి.

"సరే! అట్టనే కానీపోబ్బీ!" గంగయ్య అన్నాడు.

మరో గంటకే ఆ విషయం వూర్లో వాళ్లకు తెలిసింది.

ఊరిబైట గొర్లదొడ్డి వద్ద తన ప్రతాపం చూపాలనుకున్న ప్రతాపరెడ్డి ఒక్కసారిగా చల్లబడ్డాడు.

మందల నాయకుని వత్తాసుతో ప్రతాపరెడ్డిని ఎదుర్కొని వూర్లో మరో మేటి నాయకుడుగా ఎదగాలనుకొన్న రాఘవ గాలితీసిన బెలూన్‌లా వాలిపోయాడు.

"పిరికినాకొడుకు... పెట్టనాకొడుకు..." కసిగా అన్నాడు గంగయ్యను ఉద్దేశించి రాఘవ.

ఆ విషయం గంగయ్యకు తెలిసి "గొల్లోల్ల తకరారుతో వానికేం పనెంట? వానికేం గొర్లుండాయా? గొర్ల పంచాయితీ గొర్ల 'దొడ్లల్లోనే తేలిపోవాలి. యీధులెక్కితే యింగ గొర్లకాసినట్టే..." అన్నాడు సిమెంటు రోడ్డెక్కి చెంబు నీళ్లతో కాళ్ల బురద కడుక్కొంటూ.

ఇంట్లోకి అడుగు పెడదామంటే మళ్లీ బురద.

ఇల్లు రోడ్డుకంటే ఎత్తులేస్తేగాని బురదపోదు.

## ప్రశ్నలు

ఇల్లే కదలని వారికి
ఇంటి దారైనా గుర్తుంటుందా

రొట్టె తిన్న అందరికీ
పిండి గురించి తెలుస్తుందా

మొహాన్ని మార్చకుండా
దేహ చిత్రం మారుతుందా

అందంగా ఉండాలని
పువ్వు ప్రయత్నిస్తుందా

మన బుర్రలో మనల్ని పెడితే
మన రహస్యాలు మనకే తెలుస్తాయా

చావు లేనిది పుట్టని వారికి
ప్రశ్నలన్నీ బతికున్న వారికీనా

**- ముకుంద రామారావు**

## అభినందనలు



డి.లిట్‌ను అందుకుంటున్న ఆచార్య బమిడిపాటి విశ్వనాథ్
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, తెలుగు, బెనారస్ విశ్వవిద్యాలయం.

బెనారస్ హిందూ యూనివర్శిటీ 91వ కాన్వకేషన్ సభలో విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య బి. విశ్వనాథ్‌కు డి.లిట్ పట్టాను అందజేయడం జరిగింది. సుమారు 75 సంవత్సరాల తర్వాత బెనారస్ హిందూ యూనివర్శిటీలో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ విభాగంలో డి.లిట్ పట్టాను పొందడం విశ్వనాథ్ సాధించిన ఘనత. ఇదే విశ్వవిద్యాలయంనుంచి ఆయన ఎం.ఎ.లో బంగారు పతకాన్ని, జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందిన తెలుగు రామాయణం మరియు వాల్మీకీ రామాయణాల తులనాత్మక అధ్యయనాలపై డాక్టరేట్ పట్టాను పొందారు.